# చూపులు కలవని వేళ

## — శుభలక్ష్మి పట్నాయక్

“అమ్మాయి ఎలా వుంది?” అడిగాడు ఇనస్పెక్టర్ జయరాం—వారం రోజుల క్రితమే పెళ్ళిచూపులకు వెళ్ళివచ్చిన మిత్రుడు గోపీని.

“అంతా బాగానే వుంది గాని....” అని నసుగుతూ జేబులోని ఒక ఉత్తరం తీసి యిచ్చాడు గోపి. తెలుగులో నీటుగా టైప్ చేయబడిన ఆకాశ రామన్న ఉత్తరం అది.

అమ్మాయి మంచిది కాదనీ, అబ్బాయిలతో తెగ తిరుగుతూ వుంటుందనీ, తొందరపడి పెళ్ళి చేసుకుంటే, ఆ తర్వాత తీరికగా పశ్చాత్తాపపడవలసి వస్తుందనీ....కవిత్వ ధోరణిలో ఉందా ఉత్తరం. సంతకం లేదు.

యధాలాపంగా ఉత్తరం మడతపెట్టి జేబులో పెట్టుకున్నాడు జయ్. “దీన్ని నమ్ముతున్నావా?” అడిగాడు సూటిగా.

“అంత తేలికగా నమ్మేయడానికి నేనేం ఫూల్‌నికాదు. ఆ వూరు వెళ్ళి కొంత డిటెక్షన్ చేసి వచ్చాను” అన్నాడు గోపి గొప్పగా.

అతనికి డిటెక్టివ్ నవలల పిచ్చి. పరిశోధన చాలా సులభం అయినట్టూ, తనలో డిటెక్టివ్ లక్షణాలు పూర్తిగా వున్నట్లూ, మాట్లాడ్డం గోపీకి హాబీ.

డిటెక్షన్ చేసి తను నిజం తెలుసుకున్న వైనం వివరించాడు గోపీ.

కాలేజీ గేటువద్ద నున్న కిళ్ళీకొట్టువద్ద బీటు వేసాడట గోపీ. సహజంగానే అక్కడ కొంతె కుర్రాళ్ళు చేరారు. కాలేజీ విడిచి పెట్టగానే అమ్మాయిల వెనుక బయలుదేరారు వాళ్ళు. కొద్ది దూరంలో గోపీ వాళ్ళని అనుసరించాడు.

రోజ్‌కలర్ శారీ కట్టుకున్న అమ్మాయి గురించి చాలా అసభ్యంగా చెప్పుకుంటున్నారు కుర్రాళ్ళు. ఒకడు “ఆ అమ్మాయిని అనుభవించాను గురూ!....అబ్బా, అబ్బా....” అంటూ చొంగలు కార్చుతూ వర్ణించటం మొదలుపెట్టాడు.

“ఆ అమ్మాయికి పెళ్ళిచూపులట కదా?” అడిగాడు మరొకడు.

“పెళ్ళి అయిపోయినా సరే నాకు ఛాన్స్ యిస్తానన్నది గురూ.”

మిగిలిన వాళ్ళంతా అతని అదృష్టానికి ఈర్ష్య చెందినట్టు కనిపించారు.

“ఆ రోజ్ కలర్ శారీ అమ్మాయే....నేను చూసిన మాధవి!....ఈ సంబంధం మాకిష్టం లేదని ఈరోజే మధ్యవర్తికి ఉత్తరం రాసేసాం,” అన్నాడు గోపీ.

చెవులతో విన్నదంతా నిజం కానక్కరలేదనీ, కళ్ళతో చూసిందంతా నమ్మడానికి వీల్లేదనీ మంచి డిటెక్టివ్ కళ్ళు, చెవులతో బాటు బుద్ధిని కూడా ఉపయోగించాలనీ అంటూ వుంటాడు జయ్. ఇప్పుడు అలానే అన్నాడు.

“కాలేజీ కుర్రాళ్ళు గొప్పకోసం అలా వాగుతూ వుంటారు. అలాంటి వాగుడులో సాధారణంగా నిజం ఉండదు. కాలేజీ రోజుల్లో నీవూ అలాగే వాగేవాడివి గుర్తుందా?” అని నవ్వేశాడు జయ్.

ఉడుక్కున్న గోపీ గుర్రుగా చూసాడు. “కానీ మాధవి వెనక్కి తిరిగి అతనిని చూసి నవ్వింది, అలా నవ్వవలసిన పనేముంది?” అడిగాడు రోషంగా.

కాసేపు ఆలోచించాడు జయ్. “వాటికి బుద్ధి చెప్పడానికి ఆమె వెనక్కి తిరిగి వుండొచ్చు. వెనక్కి తిరగగానే ఆమెకు నీవు కనిపించి ఉంటావు. నిన్ను గుర్తించి పలకరింపుగా ఆమె నవ్వి వుంటుంది,” అన్నాడు.

“పోలీసు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు రా” అని నవ్వేశాడు గోపీ.

“డిటెక్షన్ నీవనుకున్నంత సులభం కాదు గోపీ. స్పష్టంగా కనిపిస్తున్న నిజం వెనుకనే ఏదో మెలిక వుంటూ తికమక పెడుతుంది—సాధారణంగా.”

“అయితే ఆమె పతిత కాదంటావ్!” సవాల్ చేస్తున్నట్టు అడిగాడు గోపీ.

“ఆమె పతిత కావచ్చు. కాకపోవచ్చు. ఏ విషయమూ నిర్ధారించడానికి నీవు చెప్పిన సాక్ష్యం సరిపోదు!”

“అనవసరంగా నన్ను గోపి అంటారు గాని అసలైన గోపి నీవేరా” అని నవ్వేశాడు గోపీ.

గోపి అంటే గోడ మీద పిల్లి.

*

వారం రోజులు సెలవు పడేసి జయ్ — కాకినాడ వెళ్ళాడు. అక్కడ వాళ్ళ బాబాయి వున్నాడు. మాధవిది కూడా కాకినాడే....ఆమె విషయం ఆరా తీయాలనిపించింది జయ్‌కి కేవలం కాలక్షేపం కోసం.

కాలేజీకి వెళ్ళాడు. దూరం నుండి ఆమెను చూసాడు. వాకబు చేసాడు. అందరూ ఏకగ్రీవంగా చెప్పడమే కాదు, తనూ చూసాడు. ఆమె అబ్బాయిలతో చాలా సోషల్‌గా మసలుతుంది. పైగా ఆమెకు సారస్వతం అన్నా, సాంస్కృతిక కార్యకలాపాలన్నా చాలా యిష్టం. అందువల్ల సారస్వత సంఘ కార్యదర్శి వేణుతో ఆమె తరుచుగా కనిపిస్తుంది. వాళ్ళిద్దరికీ అక్రమ సంబంధం ఉందని కొందరి నమ్మకం!

వేణు ఉత్తి వాగుడు కాయ!

మాధవి మీద వదంతులు అతడే వ్యాప్తిచేస్తూ వుండొచ్చు. ఆకాశరామన్న ఉత్తరం రాసింది కూడా అతడే కావచ్చు—అనుకున్నాడు జయ్.

మాధవికి పెళ్ళి యిష్టం లేదనీ, తండ్రి

బలవంతం మీద పెళ్ళి చూపులకు అంగీకరించిందనీ పెళ్ళిళ్ళ పేరయ్య చెప్పాడు.

కాలేజీ అమ్మాయిలకు పెళ్ళి వద్దనడం ఒక ఫ్యాషన్. అందువల్ల మాధవి పెళ్ళికి అంగీకరించలేదా? లేక ఆమె ఎవరినైనా ప్రేమించిందా? అబ్బాయిలతో అంత ఫ్రీగా మసిలే అమ్మాయి పెళ్ళయాక మారినా, మారకపోయినా గోపి లాంటి భర్త మాత్రం భరించలేడు. ఈ పెళ్ళి జరగకపోవడమే మంచిది అనుకున్నాడు జయ్.

*

లక్ష్మి మాధవిని ప్రక్కకు పిలిచి పెళ్ళి చూపుల ప్రసక్తి తెచ్చింది. "గోపీ పెళ్ళికి ఎందుకు అంగీకరించలేదో మీకు తెలుసా?" అని అడిగింది.


"పీడా పోయింది. నాకప్పుడే పెళ్ళి వద్దు" అంది మాధవి తేలికగా నవ్వేస్తూ.

"అంటే ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళిచేసుకుంటారన్న మాటేగా! మీకీ జీవితంలో పెళ్ళి కాదు." సవాల్ చేస్తున్నట్లు అంది లక్ష్మి. ఆశ్చర్యంగా చూసింది మాధవి.

"గోపీ మా అన్నయ్యకు ఫ్రెండ్ అట. ఆయనకు ఈ ఉత్తరం ఎవరో పంపారట" అంటూ హాండ్ బ్యాగ్ లోంచి ఆకాశరామన్న ఉత్తరం తీసి మాధవికి ఇచ్చింది లక్ష్మి.

ఆత్రంగా చదివిన మాధవి ముఖం వివర్ణం అయింది. చేతులు వణికాయి. దిగ్భ్రాంతిగా వుండిపోయింది.

"వదంతుల్ని యిట్టే నమ్మేసి అట్టే వ్యాప్తి చేసే గుంటనక్కలుంటాయని తెలిసి కూడా— ఆడవాళ్ళతో స్నేహానికి తగినవాళ్ళే లేనట్లు మగవాళ్ళతో స్నేహం చేయడం ఎందుకు? మాయని మచ్చ తెచ్చుకోవడం దేనికి?" సలహాలాంటిది పారేసి విసవిస వెళ్ళిపోయింది లక్ష్మి. అలాగే అక్కడే వుండిపోయింది మాధవి.




కాలేజీ విడిచి పెట్టాక అలవాటు ప్రకారం అమ్మాయిల వెనుక పడ్డారు అబ్బాయిలు. వాళ్ళలో వేణు కూడా వున్నాడు. ఏవో కామెంట్స్ రువ్వుతున్నాడు.

ముందు వెళుతున్న అమ్మాయిలు ఓ క్షణం ఆగారు. మాధవి వెనక్కి తిరిగి వేణుని పిలిచింది.

హీరోలాగ కాలర్ సవరించుకుని మాధవి వద్దకు వచ్చాడు వేణు.... అంతే అతని చెంప ఛెళ్ళుమంది!

"నీవేదో సంస్కారం కలవాడివని నమ్మి నీతో స్నేహం చేస్తే యిదా నీవు చేసే నిర్వాకం! బ్రూట్!" అని గర్జించి ఆ ఉత్తరం ఉండచుట్టి అతని ముఖం కేసి కొట్టి, చివాలున ముందుకు తిరిగి చరచర వెళ్ళిపోయింది మాధవి.

కొద్ది దూరంలో వుండి చూస్తున్న అబ్బాయిలకు మహా సంబరంగా వుంది! వేణుని వేళాకోళం పట్టించడం మొదలుపెట్టారు. అంతోటి మగమహారాజా వేణు, కన్నీళ్ళు పెట్టుకున్నాడు!


ఒకరినుండి ఒకరు లాక్కుంటూ ఆ ఉత్తరాన్ని అందరూ చదివి వేణుని మరింత గేలి చేయడం మొదలుపెట్టారు వాళ్ళు.

ఆ గుంపు వెనుకే నిలచి చోద్యం చూస్తున్న జయ్ ఆ ఉత్తరాన్ని చేజిక్కించుకుని, తనూ ఒక స్టూడెంట్ అయినట్లు నటిస్తూ "గురూ, ఈ ఉత్తరం నీవు రాసిందేనా?" అని వేణుని అడిగాడు.

"కాదు... కాదు" ఆవేశంగా అరిచాడు వేణు.

"మావాడు సారస్వత సంఘానికి కార్యదర్శే గాని వాడికి సారస్వతంలో పరిచయంలేదు! ఆ ఉత్తరం వాడు రాసి ఉండడు!" కినుక్కున నవ్వాడొక మిత్రుడు.

వేణు ఆ ఉత్తరం రాసి ఉండడని నమ్మకం కలిగింది జయ్‌కి. మరి ఎవరు రాసి ఉంటారు? మాధవి పెళ్ళి తప్పించడంవల్ల ఎవరికి లాభం? — ఆలోచిస్తూ ఉండిపోయాడు జయ్.




*

రాఘవేంద్ర టైప్ ఇన్‌స్టిట్యూట్‌కి ఒక అమ్మాయి వచ్చింది .... కాని ఆ సమయంలో అక్కడ ప్రిన్సిపాల్ లేదు. ఆ స్థానంలో మంగతాయారు కూర్చుని ఉంది నవల చదువుకుంటూ.

వచ్చిన అమ్మాయి టైపు పరీక్షల గురించి ఏవో వివరాలు అడిగింది గాని, తాయారు పూర్తిగా నవలలో మునిగిపోయి అసలు సమాధానమే చెప్పలేదు.

ఆ అమ్మాయి విసిగిపోయి చుట్టూ చూసింది. టైప్ నేర్చుకుంటున్న అమ్మాయిల్లో తన స్నేహితురాలు సీత కనిపించింది. అమ్మయ్య అనుకొని వెళ్ళి ఆమె ప్రక్కనే కూచుని కబుర్లు మొదలు పెట్టిందా అమ్మాయి.

అయినా తాయారు పట్టించుకోనే లేదు.

ఇంతలో ఎవరో అబ్బాయి వచ్చాడు. తాయారుని ఏదో అడిగాడు. అంతే ఆమె ముఖం ట్యూబ్‌లైట్ లాగ వెలిగిపోయింది. నవల ప్రక్కన పారేసి గబుక్కున కుర్చీలోంచి లేచింది.

సెకనుకు ఒకసారి నవ్వుతూ, నిమషానికొకసారి పైట సవరించుకుంటూ అతనితో కబుర్లు మొదలుపెట్టింది తాయారు.

ఆమె హడావుడి అంతా చూస్తూ "ఆమెకేమైనా నట్టు లూజ్ అయిందా?" సీతను అడిగింది వచ్చిన అమ్మాయి.

సీత చిన్నగా నవ్వేసింది "దానికి నట్టు లూజ్ కాదు గాని మగపిచ్చి; నవల పిచ్చి. దానికి దిష్టిపిడత అని పేరు పెట్టాం మేం. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో అబ్బాయిలు ఎక్కువగా చేరడానికి కారణం- ఈ దిష్టిపిడతతో కాలక్షేపానికే!"

"హాయిగా పెళ్ళి చేసుకోకుండా ఎందుకీ అవస్థ?"

"ఈ అందాల రాశిని ఎవరు పెళ్ళి చేసుకుంటాడే? పైగా కారక్టెర్ మంచిదికాదు" అంది సీత హేళనగా.


సీతతో మరి కాసేపు కబుర్లు చెప్పి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది... ఆ అమ్మాయి.... లక్ష్మి.

*

"పెళ్ళి చూపులకు మళ్ళీ కాకినాడ వెళ్తున్నానురా" అన్నాడు గోపి.

"టైప్ ఇన్‌స్టిట్యూట్ రాఘవేంద్రరావుగారి అమ్మాయి మంగతాయారుని చూడడానికి కదూ?" అడిగాడు జయ్ నవ్వుతూ.

ఆ విషయం అతనికెలా తెలిసిందో అర్థం కాక తెల్లబోయాడు గోపి. అతడా ఆశ్చర్యం నుండి తేరుకోక ముందే "నేనూ నీతో వస్తాను—పెళ్ళి చూపులకు!" అని నవ్వేశాడు జయ్.




*

మంగతాయారుని చూస్తూనే ముఖం ముడుచుకున్నాడు గోపి. అతని తల్లిదండ్రులకూడా ఆ అమ్మాయి నచ్చలేదు. వెంటనే వెళ్ళిపోతే మర్యాదగా వుండదని కూర్చున్నారు.

రాఘవేంద్రరావు మాత్రం వాళ్ళకి ఘనంగా మర్యాదలు జరుపుతూ, కట్నం విషయంలో ఏమీ లోటు వుండదని సూచన ప్రాయంగా తెలియజేసి "మాస్ హేమరింగ్" మొదలు పెట్టాడు.

పారిపోదా మనిపించింది గోపీకి.

"మీకు అభ్యంతరం లేకపోతే, మావాడు మీ

అమ్మాయితో ఏకాంతంగా మాట్లాడాలని కోరు తున్నాడు,'' అన్నాడు జయ్-గోపీవైపు ఓరగా చూసి నవ్వుకుంటూ. అతనిని మింగేసేటట్టు చూసాడు గోపి.

పెద్దలంతా ఆగది విడిచి వెళ్ళాక-ఒక ఉత్తరం ఆమె చేతుతో పెట్టాడు జయ్. అది గోపీకి వచ్చిన ఆకాశరామన్న ఉత్తరానికి కాపీ....కొద్ది పాటి అవసరమైన మార్పులు చేయబడ్డాయి.

''మిమ్మల్ని పెళ్ళి చేసుకోవద్దని హెచ్చరిస్తూ ఎవరో మావాడికీ ఉత్తరం నిన్ననే పంపారు.... దీనికి మీ రేమంటారు?'' అని అడిగాడు జయ్.


ఏదో అనబోయిన గోపి, తాయారు ముఖం చూసి ఆగిపోయాడు.

ఆ ముఖంలో ఆశ్చర్యం, కోపం, దుఃఖంతో బాటు గమ్మత్తయి ఏదో భావం ఒక క్షణకాలం తళుక్ మంది.

''సమాధానం చెప్పండి,'' అన్నాడు జయ్.

''ఇది కిట్టని వాళ్ళు చేసిన పని: ఊరూ, పేరూ, సంతకం ఏమీ లేవు చూసారా?'' అంది తాయారు రోషంగా.

ఆత్మీయంగా నవ్వి ''మేమూ అలాగే అను కున్నాం. కాని దీన్ని ఎవరు పంపి ఉంటారో మీకు తెలిసి వుంటుందనీ, వారి విషయంలో కాస్త జాగ్రత్త వహిస్తారనీ ఈ ఉత్తరం తెచ్చాం. ఈ ఉత్తరాన్ని మేము నమ్మినట్లయితే యిక్కడకు ఎందుకు వస్తాం చెప్పండి?'' అన్నాడు మెత్తగా




జయ్.

మగవారితో మాట్లాడ్డం అంటే మహా సరదా తాయారుకి. పైగా జయ్ నవ్వు, మాట తీరూ ఆమెను ఆకట్టుకున్నాయి. ఆమె ముఖం సంతోషంతో విప్పారింది.

''ఇది ఎవరు రాసారో చెప్పలేను గాని వాళ్ళకి స్వయం ప్రతిభ లేదని మాత్రం చెప్పగలను. ఇది కాపీ ఉత్తరం!'' అంది తాయారు గొప్పగా.

ఖంగు తిన్నట్టు ముఖం పెట్టాడు జయ్. అతని ముఖం చూస్తే జాలి వేసింది తాయారుకి. వరం యిచ్చే దేవతలాగ అంది, ''ఇది ఒక నవలలోంచి కాపీ! ఆ నవల పేరు 'ఆడదీ-అసూయ' ఆనవల మా యింట్లో ఉండాలి. వెదికి తెస్తానుండండి'' అంటూ పరుగున వెళ్ళి నవల తెరిచి ఆపేజీ చూపించింది.


ఆమె చెప్పింది నిజమే. చిన్న మార్పులు తప్ప ఉత్తరం అంతా కాపీ. సులభంగా చిక్కు విడదీసిన తాయారు వైపు మెప్పుకోలుగా చూసాడు జయ్. ఆమె పొంగిపోయింది.

ఆ పేజీని మరొక్కసారి పరిశీలించాడు జయ్. నవలలోని మిగిలిన పేజీల కన్నా ఆ పేజీ మాత్రం బాగా నలిగిపోయి వుంది.

''ఈ నవలలోని కథ ఏమిటో!'' అన్నాడు సాలోచనగా.

తాయారు ఉషారుగా కథ చెప్పడం మొదలు పెట్టింది.

రూప అందమైన అమ్మాయి. రేఖ కురూపి. ఇద్దరూ స్నేహితురాళ్ళు. అబ్బాయి లంతా రూప చుట్టూ మూగుతూ ఉంటారు. రేఖతో స్నేహంగా ఉండే ఒకే ఒక్క అబ్బాయి కూడా రూప వైపు



తిరిగి పోవడంతో అసూయతో దహించుకుపోయిన రేఖ రూపను చూడవచ్చిన వాడికి అభూత కల్పనతో ఒక ఉత్తరం రాస్తుంది. అదే ఆ ఉత్తరం....

"అందుకే అదే విధంగా మాధవి పెళ్ళి చెడ గొట్టడానికి మీరే ఆ ఉత్తరం గోపీకి పంపారు కదూ?" తాపీగా అడిగాడు జయ్.

ప్రక్కనే బాంబ్ పడినట్లు అదిరి పోయింది తాయారు!

*

ఆ యింటి నుండి బయట పడిన తరువాత—

"తాయారే ఈ పని చేసిందని ఎలా గ్రహించావు?" అని అడిగాడు గోపి.

చిన్నగా నవ్వుకున్నాడు జయ్.

"మొదట వేణుని అనుమానించి చిన్న తమాషా చేసాను. అతడు నిర్దోషి అని తేలింది. ఈ పెళ్ళి చెడగొట్టడం ఎవరికి లాభదాయకమా అని ఆలోచించాను. మళ్ళీ పెళ్ళిళ్ళ పేరయ్య వద్దకు వెళ్ళాను. అప్పుడు రాఘవేంద్రరావు అక్కడే వున్నాడు. ఆయన నిన్ను తన అల్లుడుగా చేసుకోడానికి తాపత్రయ పడుతున్నట్లు అర్థం అయింది. ఆరా తీసాను. మాధవి కుటుంబానికీ వీళ్ళకీ దూరపు బంధుత్వమూ ఉంది. వైరమూ ఉంది. రాఘవేంద్రరావే మాధవి పెళ్ళి చెడగొట్ట డాన్కి ప్రయత్నించి ఉంటాడని అనుమానించాను. లక్ష్మిద్వారా యితరత్రా కూడా తాయారు గురించి సమాచారం సేకరించాను. గత సంవత్సరం వరకూ తాయారూ, మాధవీ క్లాస్ మేట్స్. తాయారుకు బాయ్ ఫ్రెండ్స్‌తో తిరగాలన్న యావ ఎక్కువ. అయితే అబ్బాయి లంతా ఆమెను వేళాకోళం పట్టిస్తూ, మాధవిని అభిమానించే వారు. తాయారుకి ఒకే ఒక్క భక్తుడుండే వాడు. అతడు తనని పెళ్ళి చేసుకుంటాడని నమ్మింది, తాయారు. కానీ అతడూ ఆమెను ఎగతాళి చేసి మాధవి వైపు తిరిగి పోవడంతో ఆమె పట్ల ఈర్ష్య పెంచుకుంది తాయారు. మాధవి కావాలని తన ప్రియుడ్ని తన నుండి దూరం చేసిందని భావించుకుంది. పగ తీర్చుకోడానికే ఈ అవకాశాన్ని వినియోగించు కుంది."

"డిటెక్షన్ ఎంత సులభమో!" అనుకున్నాడు గోపీ-మరోసారి!

*

వేణుతో గొడవ పడిన తర్వాత కాలేజీ మానేసిన మాధవిని, లక్ష్మి తమ యింటికి ఆహ్వానించింది- బర్త్‌డే పార్టీ అంటూ. వాళ్ళింటిలో ఉన్న గోపీని చూసి ఆశ్చర్యపోయింది మాధవి. గోపీ వక్కనే యున్న యువకుని "మా అన్నయ్య జయరాం" అని పరిచయం చేసింది లక్ష్మి.

గోపీవైపు చూడలేక తలవంచుకుంది మాధవి. గోపీ హృదయం జాలితో నిండిపోయింది. "తల వంచుకోవలసింది నేను; మీరుకాదు, ఆకాశరామన్న ఉత్తరాన్ని చూసి మనసు పాడుచేసుకొని, ఆనాడు మీరు వెనక్కి తిరిగి నవ్వడం చూసి అపార్థం చేసుకున్నాను" అంటూ నెమ్మదిగా విషయం అంతా వివరించాడు గోపి.

"అబ్బాయిలు ఎవరినో అల్లరి పట్టిస్తున్నారను కున్నాను గాని, వాళ్ళు నాగురించే అంత అసభ్యంగా మాట్లాడుతున్నారని గ్రహించలేకపోయాను. యథా లాపంగా వెనక్కి తిరిగితే మీరు కనిపించారు. పలకరింపుగా నవ్వాను."

"అతనిని చూసి ప్రోత్సహింపుగా మీరు నవ్వారని నేను అపార్థం చేసుకున్నాను ...సారీ!"

"చూపులు కలిసిన శుభవేళా అని డ్యూయెట్ పాడుకోడాన్కి వీల్లేకపోయింది! నిజంగా చూపులు కలవకపోవడం వల్లనే ఈ అపార్థం!" జోక్ చేసాడు జయ్.

చిన్నగా నవ్వేసి "మగవారితో సోషల్‌గా ఉండడం వల్లనే యిన్ని అపార్థాలు! బుద్ధివచ్చింది" అంది మాధవి.

"మన కళ్ళు కూడా మనల్ని మోసం చేయ వచ్చు. చూసిందంతా నిజం కాదనీ నేనూ గ్రహించాను. బుద్ధి వచ్చింది" అన్నాడు గోపి, జయ్‌వైపు ఓరగా చూస్తూ.

"ఇంకేం? బుద్ధి మంతులిద్దరూ కలిసి ఏడడుగులు నడవడమే తరవాయి", ట్రేలో టిఫిన్ తెస్తూ అప్పుడే లోనికి వచ్చిన లక్ష్మి అంది.



'ఈనాడు మనం జరుపుతున్న పెళ్ళి చూపుల తతంగంలో అసలు అర్థం ఏమైనా వుందా? అమ్మాయి, అబ్బాయి స్వేచ్ఛగా మాట్లాడుకోడాన్కి ఒకరినొకరు అర్థం చేసుకోడానికి అవకాశమే ఉండదు. అవకాశం కల్పించినా, ఆ బిడియంలో, తత్తరపాటులో సరియైన అభిప్రాయానికి వచ్చే వీలే ఉండదు. అందువల్లనే ముఖ్యంగా మగ పెళ్ళివారు అమ్మాయి ప్రవర్తన గురించి రహస్యంగా ఈపీ లాగడాన్కి చేసే ప్రయత్నాలు ఎక్కువ అవుతున్నాయి ఈ మధ్య. ఎవరో ఏదో చెబితే సంబంధం మానుకునేవాళ్ళు వున్నారు. అమ్మాయి కాలేజీ స్టూడెంట్ అయి మగ వారితో కాస్త చనువుగా వుంటేచాలు కాకమ్మ కట్టు కథలకు అంతే ఉండదు.

ఈ కథకు ప్రేరణ నిజంగా జరిగిన ఒక సంఘటనే.

సంబంధం ఖాయం అయింది కాని ఈలోగా ఆ అబ్బాయికేం బుద్ధి పుట్టిందో ఓ రోజు అమ్మాయి చదివే కాలేజీవద్ద బీటు వేసాడు. ఆ అమ్మాయి నలుగురు అబ్బాయిలతో ఉత్సాహంగా కబుర్లు చెబుతూ వుండడం అతని కంటబడింది. అక్కడా అక్కడా వాకబు చేసాడు. 'ఆ అమ్మాయి ఒక హీరోయిన్' అని చెప్పారట.

అంతే ఆ సంబంధం రద్దు అయింది. అలాగే ఎన్నో. వయస్సు మీరిపోయాక ఆ అమ్మాయి రెండో పెళ్ళివాడ్ని చేసుకుని జీవితం ఏదోలా గడిపేస్తోంది.

ఆలోచించండి. పెళ్ళిచూపులు మరింత అర్థవంతంగా నిర్వహించవలసిన తరుణం ఆసన్నం కాలేదా?

శోభ'